# నెమలి సింహాసనం

బొంబాయిలో ఒక కార్ఖానాకు ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసరుగా ఛార్జి తీసుకున్న మరుసటి రోజునే నా దగ్గరకు ఒక దరఖాస్తు వచ్చింది. గతించిన ఒక ఫిట్టరు భార్య తన భర్త తాలూకు గ్రాట్యుయిటీ యిప్పించమని ప్రాధేయపడుతూ రాయించింది. అడుగున ఆమె బొటనవ్రేలిముద్ర సరిగా పడలేదు. అయినా, ఆ ముద్ర చూసి ఆమె ప్రతిబింబాన్ని ఆలోచించుకుంటున్నాను. ఇంతలో కోరకండా వచ్చిన ఆఫీసు సూపరింటెండెంట్‌తో ఈ విషయం ప్రస్తావనకు తెచ్చాను.

"దీని వెనుక చాలా గాథ వుంది. మొత్తం పదిమంది పదేళ్ళ క్రితం ఉద్యోగం నుంచి రిటైరయ్యారు. వాళ్ళకు రావలసిన ప్రోవిడెంట్ ఫండ్ యిచ్చేశారు. కాని గ్రాట్యుయిటీ ఇవ్వడానికి పాత రికార్డులు దొరకటం లేదు. ఈ పదిమందిలో ఒకడు మంత్రివరకు అర్జీ పెట్టాడు. లాభంలేదు."

"మన తప్పుకు వాళ్ళను శిక్షించటం బాగుందా?"

"వీళ్లు 1942 లో ఉద్యోగంలో చేరారు. 1942 నుంచి 1949 వరకూ వీళ్ళకు హాజరుబట్టే గ్రాట్యూయిటీ సంవత్సరానికి కొంత వస్తుంది. మహా ఉంటే మొత్తం నూటపాతిక రూపాయల కంటే హెచ్చు ఏ ఒక్కరికీ రాదు. బిల్లు పంపించడానికి పాత మస్తర్లన్నీ ఎంత వెలికినా దొరకడంలేదు."

"వాళ్ళకు సర్వీసు రికార్డు లున్నాయా!"

"ఆ రోజుల్లో ఏదీ సరిగ్గా వుండేదికాదు. కొన్ని కార్డులమీద వాళ్ళ సర్వీసులకు సంబంధించిన వేవో రాశారు."

"ఒకసారి నన్ను చూడనియ్యి."

కాసేపయ్యాక ఆ పదిమంది తాలూకు సర్వీసు కార్డులూ అందజేశాడు. ఆ కార్డుల మీద ప్రతివాని తాలూకు ఫోటో అంటించి ఉంది. ఆ ఫోటోలన్నీ వాళ్ళ యౌవనంలో తీసినవి. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా ఫోజు పెట్టారు. అందులో ఎందరు బ్రతికివున్నారో ఎందరు చచ్చిపోయారో! ఉద్యోగంలో వుండి ఒక్కొక్కరు చేసిన సేవను ఊహించుకున్నాను. ఆ పదిమందిలోనూ ఒక ఫోటో నేను ఆఫీసునుంచి వచ్చినా వెంటాడుతోంది. నా మనస్సు నుంచి ఆ గంభీర భీకర విగ్రహాన్ని తుడిపి పెట్టలేక పోతున్నాను, మనిషి ఒక వస్తాదులా వున్నాడు. తీక్షణమైన కళ్ళకు కొమ్ముల్లా తిరిగిన మీసాలు. అతనో పందెపు పోటేలని పించింది.

తలకు పెద్ద బుట్టలాంటి తలపాగా కిరీటంలా వుంది, అతడు సర్వీసులో వున్నప్పుడు తప్పక ఎన్నో ఘనకార్యాలు చేసి వుండాలి. వాడి మాటకు అడ్డు చెప్పగలిగేవాడు లేకపోయి వుండాలి. ఫోటో చూశాక మరచిపోలేనివాడ్ని వాడిని స్వయంగా చూసివుంటే....కలకాలం నిల్చే ముద్రను మనసులో నాటేవాడు. వాడిని చూడాలని నా మనసు ఉరకలు వేస్తోంది. వాడి గ్రాట్యుయిటీ డబ్బు నా దగ్గిర వున్నప్పుడే వాడిని పిలుస్తానని భీష్మించుకున్నాను.

ఇంతలో నేను ప్రయాణం చేస్తున్న బస్సు సుయిరి ప్రాంతంలో ఆగిపోయింది. ఏదో రిపేరు వచ్చిందన్నాడు. ఆనాడు బస్సు పనివాళ్లు స్లోడౌను స్ట్రైకు చేస్తున్నారు. పేపర్లో చూస్తే వందలూ వేలూ తెచ్చుకున్న ఉద్యోగులూ స్ట్రయికులో వున్నారు. అందువలన విమానాలు నడవలేదు. ఆసుపత్రిలో పనిచేసే వాళ్ళు సమ్మెలో పాల్గొని వారంరోజు లయింది. తంతిశాఖ ఉద్యోగులు టెలిగ్రాంలు పోస్టులో పంపుతున్నారు కోరి బస్సు ఆపినట్లుంది. విధిలేక అందరం బస్సు దిగాం. పేవ్‌మెంట్ మీద నుంచి మెల్లగా అంత దూరంలో నున్న ఇంకో బస్సు స్టాప్ వద్దకు నడుస్తున్నాను.

నా ఎదురుగా ఒక ఓవర్ బ్రిడ్జి, ఆ బ్రిడ్జి కింద పేవ్‌మెంటులో ఒకమూల గోనెలతో కట్టిన చిన్నయిల్లు అగుపడింది, ఆగి ఒకసారి ఆ యింటిలోనికి చూశాను, ఎవరూ లేరు. ఒక చిన్న చిరిగిన పరుపు. ఎవరో పారేసింది - పీడెవడికో వెచ్చదనాన్ని యిస్తోంది సగం వూడిన ఒక పింగాణీ పళ్లెం, ఒక సిల్వర్ గ్లాసు - యివి తప్పించి యింకేమీ లేవు. బొంబాయిలో కుండపోతగా కురిసే వర్షాన్ని ఈ యింటిలోని వ్యక్తి ఎలా తట్టుకుంటాడో, వేకువఝామున

వేసే చలిని ఈ చింకిగోనె లేమి అడ్డుకుంటాయ్? అందులో నివసించే వాని నికృష్టజీవితం గురించి ఆలోచిస్తూనే బస్సు స్టాపుకు చేరుకున్నాను. బహుశః ఎవరో ఆడది కాకూడదా? ఆ ఆడది యౌవనాన్నీ ఆ కూపంలో అమ్ముకో కూడదా?

ఊహలకు బంధాలు వుండవు. ఇంటికి చేరుకున్నాక, మళ్ళీ మీసాల పులిలా రాజారాం భజరంగ్ కాంబ్లే నన్ను సవాలు చేస్తున్నాడు.

ఆ ఫోటో బదులు ఆ మల్లయుద్ధ ప్రవీణుడు నా వెంటనే ఉంటున్నాడు. ఆ రాత్రి వాడి గురించే కలగన్నాను. ఉద్యోగం చేస్తూ ప్రజాసేవ బదులు తమ సేవే చేసుకుంటున్న వాళ్ళలో చేరాలని నాకు లేదు. అదే మనసులో తిరగటం వలన ఆ రోజున ఆఫీసులో ఆఫీసు సూపరింటెండెంటును పిలిచి "ఈ రికార్డులు వీళ్ళకు డబ్బిచ్చేవరకూ నా దగ్గరనే వుంటాయ్. నీకు వారం రోజులు గడువిస్తున్నాను. బిల్లు తయారవ్వాలి" అన్నాను.

నా ఆజ్ఞకు అతను నవ్వుతూ "మీ ఆర్డరు ఎలా వుందంటే షాజహాను నెమలి సింహాసనాన్ని వెతికి వారం రోజుల్లో మీ ఎదుట పెట్టమన్నట్టుంది" అన్నాడు.

ఈ పరిహాసం నాలో మరింత పట్టుదలను తెప్పించింది. ఎవరో కోరి చించి వేస్తే తప్ప ఆ ఫైళ్లు ఈ ఆఫీసులోనే వుంటాయన్న నమ్మకం నాలో వుంది. మంచిపని చెయ్యడానికి ప్రయత్నిస్తే ఏదో బలీయమైన అజ్ఞాత హస్తం తాలూకు అండదండలుంటాయనే విశ్వాసంతో నేనే పాత రికార్డులున్న గదిలోనికి వెళ్ళాను. ఆ గది ఆఫీసులో ఒకమూల ఉంది. రికార్డులన్నీ చిందరవందరగా పడి వున్నాయ్. ఆ మధ్య ఢిల్లీ నుంచి పెద్ద ఆఫీసరు తనిఖీకి వచ్చినప్పుడు ఆఫీసు లోని చెత్తంతా ఈ చెత్తలోనికి విసిరారట. అందులో తేళ్లూ జెర్రులే కాకుండా పాములు కూడా వుండే అవకాశం వుంది. ఐనా రెండు రోజులపాటు ఒక బంట్రోతును సహాయంగా తీసుకొని వెతికాను. ఆ పదిమందిలో చచ్చినవాళ్ళ ఆత్మలతో పాటు బ్రతికివున్న వాళ్ళ ఆశలు కూడా నాకు తోడయ్యాయ్.

"ఇవిగో, ఇవేమిటి?"

"మాకూ అవి దొరికాయ్. ఈ మూడేళ్ళవి వుంటే చాలదు, 1942 నుంచీ 1946 వి కూడా కావాలి."

ఆ రికార్డుల నరక కూపంలో ఇక వెతికి లాభం లేదనిపించింది, నా క్రింది వాని హేళన చెవిలో గింగురుమంటోంది. వారంరోజులనాడు బిల్లు వెళితేనే నేను నా ఉద్యోగాన్ని సార్థకం చేసుకుంటాననిపించింది. ఎక్కడైనా ఏమైనా జాడ దొరుకుతుందేమోనని ఆ రికార్డులను పదే పదే పరీక్షగా చూడసాగాను. ఒక

రికార్డు మీద ఒకమూల అష్ట వంకరలతో కొట్టి యేదో రాసుంది. అది చదివి అర్థంచేసుకునేసరికి అరగంట పట్టింది. సూపరింటెండెంట్‌ను పిల్చి-

"వీళ్ళు యింకో ఆఫీసులో 1942 నుంచి 1946 వరకూ పని చేశారు. వెళ్ళి ఆ ఆఫీసులో వెతకండి" అన్నాను.

"ఇంతకు ముందే వెతికాం. ఒక మస్తరు కాపీ కంట్రోలర్ ఆఫ్ ఎకౌంట్ ఆఫీసులో వుంటుందంటే అక్కడా వెతికాం - దొరకలేదు.''

ఆ వెంటనే నేను బయలుదేరి వారు యిదివరకు పనిచేసిన ఆఫీసు పెద్దను కలుసుకున్నా లాభం లేకపోయింది. చివరి ప్రయత్నంగా కంట్రోలర్ ఆఫీసుకు వెళ్ళి ఆఫీసరు బదులు రికార్డు రూమ్ దగ్గరనున్న దఫ్తరీని కలుసుకుని నాక్కావలసిన రికార్డుల గురించి అడిగాను.

"మీ వాళ్ళు యిదివరకు వచ్చి ఒక రోజంతా వెతికారు బాబూ!"

"వాళ్ళు సరిగా వెతికారని చెప్పగలవా?"

"ఇద్దర్లో ఒకడు కుర్చీమీద కూర్చున్నాడు. రెండోవాడు బాతాకానీలో దిగాడు."

ఆ రికార్డు గది చూశాక ఇక్కడ తప్పక నాకు దొరుకుతుందనే విశ్వాసం కలిగి ఆ ఆఫీసు పెద్దను చూశాను. అతని అనుమతిపై రెండు రోజులు స్వయంగా వెతికాను. నా కృషి ఫలించింది. నా దగ్గరనున్న రికార్డులలో పేర్లు ఆ మస్తర్లలోవున్న పేర్లూ సరిపోయినవి.

"ఇదిగో, నెమలి సింహాసనాన్ని వెతికి తెచ్చాను. రెండు రోజుల్లో పే బిల్లు నా సంతకానికి రాకపోతే యెవరో బైటకు వెళ్ళవలసి వస్తుం''దన్నాను.

ఆఫీసు సూపరింటెండెంట్ మారు మాటాడకుండా మస్తర్లు తీసుకు వెళ్ళాడు బిల్లును స్వయంగానే తీసుకువెళ్ళి కంట్రోలర్‌కు విశదంగా చెప్పాను. నా వాదనలోని మానవత్వాన్ని అతను బాగా అర్థం చేసుకున్నట్టుంది-స్వయంగా టిక్ మార్కులు పెట్టి, నేను దగ్గరుండగానే బిల్లును పాస్ చేశాడు. గ్రాట్యుయిటీ డబ్బు తొమ్మిది మందికి పేమెంట్ చేశాను. అందులో నలుగురే స్వయంగా అందుకున్నారు. మిగిలిన అయిదుగురిలో భార్యలూ, కుమారులూ వచ్చి తీసుకున్నారు. ఇందులో ఎవరూ గొప్ప వుత్సాహంగాని, సంతోషంగానీ చూపించలేదు. బహుశః వాళ్ళు వేలకొద్దీ వస్తుందని ఆశించ వుండవచ్చు. తీరా ఏ ఒక్కరికీ నూరు, నూటపాతిక దాటకుండా వచ్చాయ్. ఇద్దరు "ఏ మింత తక్కువ?" అనికూడా అడిగారు.

నేను ఎదురు చూసిన కాంప్లెంట్ రాలేదు. మా రికార్డులలో నున్న ఎడ్రసుకు పంపిన రిజిస్టర్డు వుత్తరం వాడి ప్రస్తుతపు తావు తెలియదని తిరిగివచ్చింది. ఈ లోగా వాడి ప్రస్తుతపు రూపురేఖల గురించి ఎన్నో విధాలుగా వూహించు

కున్నాను. ఈ యెనభై రూపాయల పావలాను తిరిగి సర్కారుకు అప్పజెప్ప డానికి మనస్కరించక, యిదివరకు వాడితో పనిచేసే వాళ్లెవరికైనా వాడి ప్రస్తుత నివాసం తెలుస్తుందేమోనని వాకబు చేశాను. ఇంచుమించు అందరూ తెలీదనే అన్నారు. చివరకు ఒకడు—

"నాకు తెలుసు. ఈ వూర్లోనే వున్నాడు కానీ, వాడిని ఎవరూ కాంబ్లే అంటే నమ్మరు" అన్నాడు.

"ఎక్కడున్నాడు?''

''నుయిరీలో ఒక వంతెన వుంది. ఆ వంతెన క్రింద....''

"గోనెలతో కట్టిన గుడిసెలో వున్నాడా?''

''మీకెలా తెలుసు బాబూ?"

''ఆ గోనెల ఇంటిని చూశాను. కానీ మనిషిని చూడలేదు. వెళ్ళు, వేగం తీసుకురా.'' ఈలోగా నా మనసులో ఎన్నెన్నో ఆలోచనలు— డబ్బు పుచ్చుకునే టప్పుడు యెల్లాంటి తృణీకారం చూపిస్తాడో? నా విధి నేను నిర్వర్తించినా లోలోన నా మనసు ఒక కృతజ్ఞతతో కూడిన మాటను కాంక్షిస్తోంది. అది ఈ చివరి వ్యక్తి దగ్గర పొందుతానా?

రెండు గంటల తరువాత నా దగ్గరకు ఒక ఎముకల పోగును తీసుకు వచ్చాడు. నా ఎదురుగా నున్న ఫోటోలో కాంబ్లేకి, ఈయనకు ఎక్కడా పోలిక లేదు. ముదిమికంటె మిన్నగా లేమి ఇతని పైబడి అతని మాంసాన్ని కరుకు పళ్ళతో నమిలి మింగి, రక్తాన్ని దాహంతో గడగడ తాగి, చర్మాన్ని కోరలతో రక్కివేసింది. ఒక కంటిలో పూవు, రెండో కన్ను కొద్దిగా కనిపిస్తోంది వెంట్రుకలు కూడా ఆకలి భరించలేక రాలిపోయినట్లున్నాయి నేను కుర్చీమీద కూర్చోమంటే క్రిందనే కూర్చోబోయాడు. నేను చప్పునలేచి నా ఎదురుగా నున్న కుర్చీలో బలవంతాన కూర్చోబెట్టాను. ఇప్పుడు వాడి పులిలాంటి బుర్ర నా ఎదురుగావుంది. ఆ పులి పళ్లూడాయ్. చర్మం ముడతలుపడి ఎముకలకు అంటుకుని వుంది. ఒకసారి నిదానించి ఫొటోవేపు, కాంబ్లే వేపు చూశాను. ఊహతో రూపులలో యేకత్వాన్ని సమర్థించుకున్నాను.

''నీకెవరూ లేరా?"

"సాయబా! నా మొదటి పెళ్ళాం కూతురు ఒకర్తి వుండేది. దానికి దేవుడు ఆయుర్దాయం తక్కువ పోశాడు. రెండో పెళ్ళాం నన్నొదిలిపోయింది."

''ఎందుకు వదిలింది?''

''నా దగ్గర డబ్బులేదు. వయస్సు లేదు. దానికి డబ్బవసరం. వయ సుంది - పిల్లల్లేరు...."

''డబ్బెందుకు లేదు; నీ ప్రోవిడెంట్ ఫండ్ డబ్బేమైంది?''

''సాయబా!" ఓ క్షణం ఆ గొంతుక పట్టుకపోయింది. మళ్ళీ అలసట తీర్చుకుని ''పని వదలిన ఆర్నెల్లనాడు డబ్బు అందుకోడానికి రమ్మన్నారు. నేను వస్తున్న బస్సు త్రోవలో పోయింది. ఇంకో బస్సులో వచ్చేసరికి ఆలస్యమై పోనాది. కోప్పడి రేపు రమ్మన్నారు. బతిమాలినా పో పొమ్మన్నారు. ఆ మరునాడొచ్చాను. రెండుయేల రూపాయలు. సార్వీసంతా కార్చిన సెమట కష్టం.... పొద్దున్నొచ్చినాను ... సాయంత్రానికిచ్చినారు. మళ్ళా బస్సులో పోనాను. సాయంకాలం తోపులాట కదా.... దిగేసరికి పోకట్టు ఖాళీ. నెత్తీ - నోరూ కొట్టుకున్నాను. పోకట్‌మార్ గాడెవడో నా వుసురు తగిలి మండిపోయే వుంటాడు.''

ఇక నేనేమైనా ప్రశ్నలు వేస్తే కాంబ్లే జవాబులు వాడికే కాదు, నాకూ బాధ కలిగిస్తాయ్. ఆ తరవాత జరిగినది ప్రశ్నించకుండానే నగ్నంగా కనిపిస్తోంది. కాళ్లు - చేతులాడేవరకూ కూలీ చేసి వుంటాడు. తరువాత బిచ్చమెత్తు కుంటున్నాడు.

మౌనంగా వాడిచేత రసీదుమీద సంతకం తీసుకున్నాను. మనిషి మారినా రికార్డులో నున్న సంతకానికి ఈ మరాఠీలో పెట్టిన సంతకానికి అట్టే మార్పు లేదు.

''ఇదిగో ఈ యెనభై రూపాయల పావలా - నీ తాలూకు గ్రాట్యుయిటీ!" అని వాడి చేతిలో పెట్టాను.

చప్పున కాంబ్లేలో యేదో సంచలనం కలిగింది. ముఖ భంగిమలన్నీ మారిపోయాయ్. ఈ అస్థిపంజరంలో ప్రాణం వుంది. వలవలా ఏడ్చేస్తున్నాడు. ఆ కన్నీటి ధారకు నేను అడ్డువచ్చే మాటలేమీ అనకుండా మౌనంగా వాడివేపు చూస్తున్నాను. కాసేపయ్యాక తన వీపుమీద నున్న చింకి గుడ్డతో కళ్ళు ఒత్తుకుని—

"సాయబా! ఈ ఆఫీసు నా ఇల్లు లాంటిది. ఉద్యోగం సరన్నప్పుడు నా ఇంటినుంచి నన్నెవరో తగిలేసారనిపించింది. కాదామరి? ఇక్కడ ఎన్ని ఓగన్లు ఎక్కించాను - ఎన్ని ఓగన్లు దించినాను. ఐదొందల పౌన్ల సామాను ఒక్కడ్నే ఎత్తేసేవోడ్ని - దరిద్రంలో పడి అంతా మరిచిపోయాను. ఈనాడు నా ఇల్లొకటున్నాదని గేపకానికి తెప్పించావు - నా వంతు యిచ్చినావు - ఈ యెనభై రూపాయలూ.... యేలు - యేలుతో సమానం. ఈ డబ్బుతో తిని... తిని....తిని హాయిగా సచ్చిపోతాను. దేముడు నిన్ను బాగా సూస్తాడు."

అలా అని ఒక నమస్కారం చేసి, లేచి మెల్లగా తనను తెచ్చినవాని భుజంమీద చెయ్యివేసి బయటకు నడిచాడు.

నా మట్టుకు నాకు నెమలి సింహాసనంపై కూర్చున్నట్లే అనిపించింది. *

(1967)